
# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 30 | పేజీలు: 4 | వెల: 4/- | ఆదివారం ● 18, ఆగస్టు 2024 | ఎడిటర్: ఎం.వనిత రెడ్డి


## 19 సంస్థలతో రూ.31,500 కోట్ల విలువైన ఒప్పందాలు

◆ విదేశీ పర్యటనపై మంత్రి శ్రీధర్ బాబు వివరణ



హైదరాబాద్,ఆగస్టు17(నమస్తే ఉదయం): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు 19 సంస్థలతో రూ.31,500 కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పెట్టుబడుల ద్వారా 30,750 ఉద్యోగాలు వచ్చే అవకాశముందన్నారు. 'దక్షిణ కొరియాలో దాదాపు 12 సంస్థలతో చర్చలు జరిపాం. ఏఐ, ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులపై చర్చించాం. మూసీ పునరుజ్జీవం కోసం కొన్ని అధ్యయనాలు చేశాం. మూసీ సుందరీకరణపై ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడితో చర్చించాం. రాష్ట్రంలో బయోడిజైర్ సిటీని ఏర్పాటు చేయాలని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీని కోరాం' అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.




## మట్టి వినాయకులనే పూజించండి

◆ పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం
◆ అధికారులతో చవితి నిమజ్జనం, ఏర్పాట్లపై సమీక్ష
◆ లోటుపాట్లు లేకుండా నిర్వహిస్తామని పొన్నం హామీ

హైదరాబాద్,ఆగస్టు17(నమస్తే ఉదయం): వినాయక చవితి ఏర్పాట్లపై తెలంగాణ ప్రభుత్వం దృష్టిసారించింది. వినాయక చవితి, వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై వివిధ విభాగాల అధినేతలతో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. వినాయక చవితి, నిమజ్జనం ఏర్పాట్ల గురించి చర్చించామని మీడియాకు వివరించారు. వినాయక చవితి సందర్భంగా గతంలో లోపాలు జరిగాయని, ఆ లోటుపాట్లు లేకుండా ఈ సారి నిర్వహిస్తామని స్పష్టం చేశారు. బోనాల పండగను ఘనంగా నిర్వహించామని.. అదేవిధంగా వినాయక చవితి పండగ, నిమజ్జనం జరిపిస్తామని వివరించారు. వినాయక చవితి, నిమజ్జనానికి సంబంధించి ప్రజా ప్రతినిధులు, గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులతో వారం రోజుల్లో సమావేశం అవుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. వినాయక చవితి అంటే గుర్తొచ్చేది ముంబై అని వివరించారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు పేరు ఉందన్నారు. హైదరాబాద్ నగర ఇమేజ్ పెంచేలా వినాయక చవితి, నిమజ్జనం జరిగేలా చూస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. వినాయక చవితిలో ప్రజలందరూ భాగస్వామ్యులు అయ్యేలా చేస్తామని వెల్లడించారు. అందరిని కలుపుకొని పండుగను ఘనంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. విగ్రహాల ప్రతిష్టాపన నుంచి నిమజ్జనం వరకు ఎక్కడా ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి పొన్నం ఆదేశాలు జారీ చేశారు. మిగతా.. 2లో



## హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్

◆ సీఎంను నివాసంలో కలిసిన హడ్కో చైర్మన్

హైదరాబాద్,ఆగస్టు17(నమస్తే ఉదయం): ఇటీవల ఖమ్మం పర్యటన తర్వాత తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హుటాహుటిన ఢిల్లీకి వెళ్లారు. కాగా శనివారం ఢిల్లీ పర్యటనను ముగించుకుని ఆయన హైదరాబాద్‌కు చేరుకున్నారు. వచ్చి రాగానే తన నివాసంలో పలువురు మిగతా.. 2లో

## ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై సీఎం సమీక్ష

◆ కొత్త హైకోర్టు నుంచి మెట్రో మార్గాల అన్వేషణ

హైదరాబాద్,ఆగస్టు17(నమస్తే ఉదయం): ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు కనెక్టివిటీ రూట్ మ్యాప్‌ను అధికారులు సీఎంకు వివరించారు. మిగతా.. 2లో



## యధావిధిగా విద్యుత్ బిల్లులు చెల్లింపు

◆ డిజిటల్ పేమెంట్స్‌కు మళ్లీ అనుమతి

హైదరాబాద్,ఆగస్టు17(నమస్తే ఉదయం): తెలుగు రాష్ట్రాల్లో విద్యుత్ వినియోగదారులకు కష్టాలు తప్పాయి.రెండు నెలలుగా పడుతున్న సమస్యకు పరిష్కారం లభించింది. చేసిన తప్పును తెలుసుకున్న డిస్కంలు దారిలోకి వచ్చాయి. ఎప్పటి మాదిరిగానే డిజిటల్ పేమెంట్స్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా చెల్లించవచ్చని సెలవిచ్చాయి. డిజిటల్ పేమెంట్ యాప్స్ వచ్చిన తర్వాత కరెంటు బిల్లులు




చెల్లించడం చాలా సులభమైపోయింది. అంతకు ముందు ఈ బిల్లు చెల్లించేందుకు పెద్ద యుద్ధాలే జరిగేవి. అయితే ఈ మధ్య కాలంలో డిస్కంలు తీసుకున్న నిర్ణయం చాలా వివాదాస్పదమైంది. డిజిటల్ పేమెంట్ యాప్స్ ద్వారా బిల్లులు చెల్లించడానికి వీల్లేదని చెప్పడంతో చాలామంది కన్ఫ్యూజ్ అయ్యారు. ఇబ్బంది పడ్డారు. రెండు నెలల క్రితం కరెంటు బిల్లులు డిజిటల్ పేమెంట్ యాప్స్ ద్వారా కాకుండా నేరుగా గానీ లేదా అధికారిక వెబ్‌సైట్స్ ద్వారా అయినా చెల్లించాలని కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఇది చాలా మందిని ఆశ్చర్యపరిచింది. అయితే కొందరు ఇప్పటికీ కొత్త విధానానికి టర్న్ అవ్వలేదు. మరికొందరు నేరుగా వెళ్లి చెల్లిస్తున్నారు. ఇంకొందరు డిస్కమ్‌లు సూచించిన వెబ్‌సైట్, యాప్ ద్వారా చెల్లిస్తున్నారు. దీని వల్ల కరెంటుబిల్లు చెల్లింపులపై తీవ్ర ప్రభావం చూపించింది. చాలా వరకు బకాయిలు పేరుకుపోయాయి. డిస్కంలు సూచించిన యాప్స్, వెబ్‌సైట్ సరిగా పనిచేయడం లేదన్న ఫిర్యాదులు ఎక్కువ అయ్యాయి. ఇలా అన్ని విధాలుగా ఇబ్బందు ఎదురుకావడంతో డిస్కంలు పునరాలోచించుకున్నాయి. వినియోగదారులు అలవాటు పడిన విధానంలో కాకుండా మార్పులు చేసి తప్పు చేశామని భావించి నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాయి. పరిస్థితిలో మార్పు తీసుకొచ్చేందుకు పాత విధానంలోనే కరెంటు బిల్లులు చెల్లించుకోవచ్చని సెలవిచ్చాయి. మిగతా.. 2లో

# రోడ్డెక్కిన అన్నదాతలు


◆ రుణమాఫీ కాలేదంటూ పలుచోట్ల ఆందోళనలు
◆ సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మలు దహనం
◆ బిఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందన్న మంత్రి



హైదరాబాద్,ఆగస్టు17(నమస్తే ఉదయం): కాంగ్రెస్ సర్కార్ చేసిన రూ.2 లక్షల రుణమాఫీ తమకు కాలేదని రాష్ట్రవ్యాప్తంగా పలు గ్రామాల్లో రైతులు శనివారం నిరసనలు తెలిపారు. రుణమాఫీ జరగలేదని రోడ్లపై ముళ్ల కంచెలు వేసి నిరసనకు దిగారు. ఆదిలాబాద్ - జైనథ్ మండల కేంద్రంలో రుణమాఫీ జరగలేదని, రుణమాఫీపై స్పష్టమైన హామీ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. వారికి బీఆర్ఎస్ బోథ్ ఎమ్మెల్యే అనిల్ యాదవ్ మద్దతుగా నిలిచారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులపట్ల కక్షపూరిత వైఖరితో వ్యవహరిస్తున్నారని ఆయన వెంటనే సీఎం పదవికి రాజీనామా చేయాలని అనిల్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ ధర్నాతో జాతీయ రహదారిపై వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. కాగా.. రుణమాఫీ జరగలేదని ఖమ్మంలో కూడా నిరసనలు కొనసాగాయి. తమకు కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని పలువురు రైతులు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిరసనలకు దిగారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. ఇలాగే పులచోట్ల రుణమాఫీపై రైతన్నలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రుణాలు మాఫీ కాలేదంటూ అన్నదాతలు రోడ్డెక్కుతున్నారు. మూడో విడుతలోనూ తమకు బాంకు లోన్లు మాఫీ కాకపోవడంతో ఆదిలాబాద్ జిల్లాలోని తలమడుగు మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మకు పాడెకట్టి శవయాత్ర నిర్వహించారు. ఓ రైతు ముందు నడుస్తుండగా డప్పు చప్పుళ్ళ, వాయిద్యాల మధ్య ముఖ్యమంత్రి పాడెను తలమడుగులో ఊరేగించారు. ఈ శవయాత్రలో సుమారు 500 మంది రైతులు పాల్గొన్నారు. ఇక పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయలేదంటూ సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలో రైతులు రోడ్డుపై బైఠాయించారు. తమ రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా వేంపేట గ్రామంలో రుణమాఫీ జరగలేదని కెనరా బ్యాంక్ ముందు రైతుల ధర్నాకు దిగారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని మొలంగూర్ ఇండియన్ బ్యాంక్ ఎదుట రుణమాఫీ కానీ రైతులు భారీ ఆందోళన మిగతా.. 2లో

● వస్తవా? పోదామా... రేవంత్ రెడ్డి?
● ప్లేసు, డేటు, టైము నువ్వే చెప్పు
● ఏ జిల్లాకు పోదాం, ఏ నియోజకవర్గానికి పోదాం
● పరిపాలనలో ఫ్లాప్... తొండి చేయడంలో తోపు.. బూతులు మాట్లాడంలో టాపు
● తప్పు అయ్యింది అని క్షమాపణ అడుగు
● దమ్ముంటే రుణమాఫీ మీద శ్వేత పత్రం విడుదల చేయండి.
● తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీష్ రావు

## రుణమాఫీపై తప్పుడు లెక్కలతో బురిడీ



హైదరాబాద్,(నమస్తే ఉదయం): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరు దొంగతనం చేసిన దొంగనే దొంగ దొంగ అని బిగ్గరగా అరిచినట్లు ఉంది. రుణమాఫీ ఎగనామం పెట్టి ఫోజులు కొడుతున్నారు. పాక్షికంగా అమలు చేశారు తప్ప పూర్తిగా చేయలేదు. తప్పు అయ్యింది అని క్షమాపణ అడుగు. రాజీనామా చెయ్యి రేవంత్ రెడ్డి. నోరు పెద్దగా చేసుకొని మాట్లాడితే లాభం ఉండదు. కాంగ్రెస్ రుణమాఫీ కథ ఎట్లుందంటే.. ఎనకటికి ఎవడో పంచపాండవులు అంటే మంచం కోళ్లవలె.. ముచ్చటగా ముగ్గురు అని చెప్పి రెండు వేళ్లు చూయించాడట. అట్లున్నది కాంగ్రెస్ రుణమాఫీ కథ. అసెంబ్లీ ఎన్నికల సమయంలో డిసెంబర్ 9 సోనియా గాంధీ పుట్టిన రోజు కానుకగా 40వేల కోట్ల రూపాయల రుణ మాఫీ ఏకకాలంలో మిగతా.. 2లో



## మంకీఫాక్స్ అంటువ్యాధి..

◆ మంకీఫాక్స్‌ను గ్లోబల్ ఎమర్జెన్సీగా ఆరోగ్య సంస్థ ప్రకటన
◆ ఆఫ్రికా దేశంలో 17,500 మంకీ ఫాక్స్ కేసులు నమోదు
◆ హైదరాబాద్‌లోనూ అప్రమత్తమైన అధికారులు

న్యూఢిల్లీ,ఆగస్టు17,(నమస్తే ఉదయం): కరోనా కంటే మంకీఫాక్స్ డేంజర్,ఇది అంటువ్యాధి అని ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ ఎమర్జెన్సీగా ప్రకటన జారీ చేయడంతో హైదరాబాద్ నగరంలో అలర్ట్ ప్రకటించారు. ఆఫ్రికా దేశ విద్యార్థులు హైదరాబాద్ నగరంలో ఉన్ననేపథ్యంలో అప్రమత్తత ప్రకటించారు. ఆఫ్రికా దేశంలో ఇప్పటికే 17,500 మంకీ ఫాక్స్ కేసులు నమోదయ్యాయి. ఈ మహమ్మారి వల్ల 460 మంది మిగతా.. 2లో



## ప్రధాని మోడీతో చంద్రబాబు భేటీ

◆ ఆర్థిక అంశాలపైనే ప్రధానంగా చర్చ
◆ పోలవరం, రాజధానికి నిధులపై ప్రస్తావన
◆ రుణపరిమితి పెంచాలని విన్నవించినట్లు సమాచారం
◆ పలువురు కేంద్రమంత్రులతోనూ చర్చలు

న్యూఢిల్లీ,ఆగస్టు17(నమస్తే ఉదయం): ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రధానితో చర్చించినట్లు సమాచారం. ముఖ్యంగా రుణాలు రీ షెడ్యూల్ చేయాలని కోరినట్లు తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును భరిస్తామని కేంద్రం హామీ ఇచ్చిన నేపథ్యంలో.. ఆయా నిధుల మంజూరుపై ప్రధానితో మాట్లాడినట్లు తెలుస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం చేయనున్నట్లు ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఈ నిధుల విడుదలపైనా చంద్రబాబు వాకబు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా వెనకబడిన జిల్లాల జాబితాలో ఉన్న 8 జిల్లాలకు ఆర్థికసాయం కింద నిధులు విడుదల చేయాలని ప్రధాని మోదీని చంద్రబాబు కోరినట్లు తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్టు విషయంలో వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుని నిధులు విడుదల చేయాలని ప్రధానమంత్రి మిగతా.. 2లో

## దసరా నుంచి స్కిల్ వర్సిటీలో శిక్షణ

◆ అందుబాటులోకి దాదాపు 20 కోర్సులు
◆ ఉన్నతస్థాయి సమీక్షలో సిఎస్ శాంతికుమారి వెల్లడి

హైదరాబాద్,ఆగస్టు17(నమస్తే ఉదయం): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష మేరకు రూపుదిద్దుకున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో దసరా పండగ నుంచి కోర్సులు ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా దాదాపు 20కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రాథమికంగా ఆరు కోర్సులను ముందుగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు సీఎస్ వివరించారు. స్కిల్



యూనివర్సిటీ ప్రారంభం, విధివిధానాలు, కోర్సుల ప్రారంభం తదితర అంశాలపై శనివారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించినట్లు సీఎస్ శాంతి కుమారి వెల్లడించారు. ముచ్చర్ల వద్ద కేటాయించిన 57ఎకరాల స్థలంలో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన విషయాన్ని సీఎస్ గుర్తు చేశారు. నిర్మాణ పనులు మిగతా.. 2లో




## దేశ వ్యాప్తంగా వైద్యుల నిరసనలు

◆ విధులు బహిష్కరించి నిరసనలు..ధర్నాలు
◆ కేవలం ఎమర్జెన్సీ కేసులు మాత్రమే హాజరు

న్యూఢిల్లీ,ఆగస్టు17(నమస్తే ఉదయం): కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటన దేశ వ్యాప్తంగా కాకరేపుతోంది. కోల్‌కతాలో జరిగిన ఘటనపై దేశంలో వైద్యులంతా ఏకతాటిపైకి వచ్చారు. గతంలో ఏవైనా ఘటనలు జరిగేటప్పుడు స్వరాష్ట్రంలో మాత్రమే నిరసనలు జరిగేవి. తీవ్రత ఆధారంగా దేశ వ్యాప్తంగా నిరసన గళం వినిపించేది. ప్రస్తుతం కోల్‌కతా ఘటనపై ప్రతి ఒక్కరూ న్యాయం కోసం నినదిస్తున్నారు. దేశంలో వైద్యులంతా ఐక్యమై రోడ్డెక్కారు. ముందు తమ ప్రాణాలకు రక్షణ కల్పిస్తే.. తాము రోగుల ప్రాణాలు కాపాడతామంటూ వైద్యులు నినదిస్తున్నారు. మరోవైపు పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పక్షాలు వైద్య విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఓవైపు సీబీఐ విచారణ కొనసాగుతుండగా.. త్వరగా విచారణ పూర్తిచేసి..నిందితులను మిగతా.. 2లో

## ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై
# సీఎం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

అవుటర్ రింగ్‌రోడ్డు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు కనెక్టివిటీ ఉండేలా రోడ్ మ్యాప్ తయారు చేయాలని సీఎం సూచించారు. ఫ్యూచర్ సిటీలో రేడియల్ రోడ్స్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కొత్త హైకోర్టు నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు మీదుగా ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గం ప్రణాళికలు చేయాలన్నారు. రోడ్, మెట్రో మార్గాలకు భూసేకరణ ఇతర అంశాలపై అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. త్వరగా పూర్తి స్థాయి ప్రణాళికలు, రూట్ మ్యాప్ సిద్ధం చేసి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. తెలంగాణలో క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. హకీంపేట లేదా గచ్చిబౌలిలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి ప్రతిపాదించారు. స్పోర్ట్స్ మెడిసిన్, స్పోర్ట్స్ సైన్స్ సహా సుమారు డజనుపైగా కోర్సులు ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల సియోల్‌లో కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీలో భాగస్వామ్యానికి కేఎన్ఎఎస్‌యూ ప్రాథమికంగా అంగీకరించిందని ఈ సందర్భంగా సీఎం తెలిపారు.

## దసరా నుంచి స్కిల్ వర్సిటీలో శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

ముగిసేంతవరకు తాత్కాలిక భవనంలో తరగతులు నిర్వహిస్తామని శాంతి కుమారి తెలిపారు. తరగతులను ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా, నాక్ లేదా నిథమ్ కళాశాలలో నిర్వహిస్తామని ఆమె చెప్పుకొచ్చారు. ఇప్పటికే విశ్వవిద్యాలయం ఛైర్మన్‌గా ఆనంద్ మహీంద్రాను, కో-ఛైర్మన్‌గా శ్రీనివాస సి.రాజును నియమించినట్లు పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో దాదాపు 140కంపెనీలు భాగస్వామ్యం కావడానికి ఆసక్తి చూపుతున్నాయని, దాదాపు 20కోర్సులను ప్రారంభించేం దుకు ప్రణాళికలు రూపొందించినట్లు సీఎస్ శాంతి కుమారి వెల్లడించారు. తొలుత స్కూల్ ఆఫ్ ఈ-కామర్స్, లాజిస్టిక్స్ రిటైల్ విభాగంలో సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులను ప్రారంభిస్తామని సీఎస్ శాంతి కుమారి పేర్కొన్నారు. దేశంలో ప్రముఖ కార్పొరేట్ సంస్థలైన ఎస్బీఐ, ఎన్‌ఏసీ, డా.రెడ్డి, టీవీఏజీఏ, అదానీ, సీఐఐ కంపెనీలు భాగస్వాములుగా ఉండేందుకు అంగీకరించాయని ఆమె వెల్లడించారు. ఈ సంస్థలు తమ కంపెనీల్లోని వివిధ విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తాయని ఆమె పేర్కొన్నారు.

ఈ సమావేశంలో యూనివర్సిటీ లోగో, వైబ్ సైట్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. కోర్సు పూర్తి చేసిన వారికి ఆకర్షణీయమైన వేతనంతో ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సీఎస్ శాంతి కుమారి సూచించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక, పరిశ్రమల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, జయేశ్ రంజన్, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొ.వెంకటరమణ, శ్రీనిరాజు, వీవీఎల్ఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## దేశ వ్యాప్తంగా వైద్యుల నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

కఠినంగా శిక్షించాలంటూ పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సైతం నిరసనల్లో పాల్గొన్నారు. మమతా బెనర్జీ రాజీనామా చేయాలని పశ్చిమబెంగాల్ బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు ఈ ఘటనలో నిందితులందరిని తక్షణమే అరెస్ట్ చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం కేసులో ఆసుపత్రిలోని కొందరు వైద్యులు, సిబ్బంది పాత్ర ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ ఘటనపై తెలుగు రాష్ట్రాల్లో వైద్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ అత్యాచార ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), ఫ్యాకల్టీ అసోసియేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ దేశశ్యాప్తంగా నిరసనకు పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా శనివారం 24 గంటలపాటు వైద్య సేవల బంద్ చేయాలని నిర్ణయించాయి వైద్య సంఘాలు. అత్యవసర సేవలు మినహా అన్ని ఆరోగ్య సేవలు, సాధారణ సేవలు శస్త్రచికిత్సలు శనివారంఉదయం 6 నుండి ఆదివారం ఉదయం 6 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు తెలిపింది. డాక్టర్లు కేవలం ఎమర్జెన్సీ కేసులను మాత్రమే అటెండ్ అవ్వాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వెల్లడించింది. ఐఎంఏ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఓపీ సేవలు నిలిచిపోయాయి. ఈ సమ్మెకు దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, మెడికల్ సిబ్బంది సైతం తమ సంఘీభావం ప్రకటించి ఓపీ సేవలను నిలిపివేశారు.

ఈ క్రమంలో ఓపీ సేవలు నిలిచిపోవటంతో దేశవ్యాప్తంగా రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నిరసన ద్వారా వైద్యులు పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచుతున్నారు. వైద్యులకు కేంద్ర రక్షణ చట్టం అమలు చేయాలని, కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో బాధితురాలికి తక్షణ న్యాయం జరగాలని డిమాండ్ చేస్తున్నారు. సెక్యూరిటీ ఆడిట్, సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అందుబాటులో ఉండేలా చూడాలని, ఆసుపత్రిలో అమర్చిన కెమెరాల పూర్తి నివేదిక ఇవ్వాలని డాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు తమ సమస్యల పరిష్కారం కోసం వైద్య సేవలను నిలిపివేస్తుంటారు. కానీ కోల్‌కతా ఘటనపై ప్రయివేట్ ఆసుపత్రుల వైద్యులు 24 గంటల పాటు ఓపీ సేవలను నిలిపివేశారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు తెలంగాణలో అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీ సేవలు నిలిచిపోతాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రకటించింది. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు నిర్వహిస్తోంది. కోల్‌కతా ఘటన అత్యంత హేయమని, బాధ్యులను ఇప్పటిరవకు గుర్తించకపోవడం, వైద్యులకు తగిన భద్రత, రక్షణ లేకపోవడం అన్యాయమని ఐఎంఏ నాయకులు తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అత్యవసర సేవలు మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు. హైదరాబాద్ ఇందిరాపార్క్‌లోని ధర్నాచౌక్‌లో ఐఎంఏ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

తెలంగాణ వ్యాప్తంగా పలు పట్టణాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది నిరసన ప్రదర్శనలు చేశారు. కోల్‌కతా ఘటనపై సీబీఐ విచారణను వేగవంతం చేసి నిందితులందరినీ అరెస్ట్ చేయాలని వైద్య సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఐఎంఏ పిలుపుతో శనివారం ఉదయం 6గంటల నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు ఓపీ సేవలను నిలిపి వేస్తున్నట్లు రాష్ట్రంలోని ప్రధాన కార్పొరేట్ ఆసుపత్రులు ప్రకటించాయి. అపోలో, కిమ్స్, స్టార్, యశోద, రెయిన్‌బో, కిమ్స్-సన్షైన్ ఆసుపత్రులు సహా వివిధ ఆసుపత్రుల్లో 24 గంటలపాటు ఓపీ ఉండబోదని, ఎమ్జెన్సీ సేవలు అందిస్తామని వెల్లడించాయి.

# ప్రధాని మోడీతో చంద్రబాబు భేటీ

(మొదటి పేజీ తరువాయి)

మోదీని చంద్రబాబు కోరినట్లుగా తెలుస్తోంది. ప్రధానితో ఆయన సుదీర్ఘంగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరిపారు. ముఖ్యంగా రాష్ట్రానికి రుణ పరిమితి పెంచడంతో పాటు రాజధానికి ఇప్పిస్తామన్న పదిహేను వేల కోట్ల నిధుల గురించి.. ఇతర గ్రాంట్ల గురించి చర్చించినట్లుగా తెలుస్తోంది. జగన్మోహన్ రెడ్డి హయాంలో చేసిన అప్పులను రీషెడ్యూల్ చేయాలని ఏపీ ప్రభుత్వం ఇటీవలి కాలంలో ప్రధానంగా కోరుతోంది. ఈ అంశంపైనా ప్రధాని మోదీకి నివేదిక ఇచ్చినట్లుగా చెబుతున్నారు. గత ఐదేళ్ల కాలంలో జరిగిన ఆర్థిక విధ్వంసం వల్ల ఏపీ ఆర్థిక పరిస్థితి అత్యంత ఘోరంగా మారింది. ఈ క్రమంలో ఆర్థిక వ్యవస్థను దారిలో పెట్టుకోవాలంటే కేంద్ర సాయం అవసరమని భావిస్తున్నారు. ఈ క్రమంలో పలు ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ముందు పెట్టింది. కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ కీలక పాత్ర పోషిస్తోంది . బీజేపీకి పూర్తి మెజార్టీ లేకపోవడంతో టీడీపీ మద్దతు కీలకం. అందుకే టీడీపీ కీలక ప్రయోజనాలను సాధించుకుంటోందన్న అభిప్రాయం జాతీయ రాజకీయాల్లో ఉంది. చంద్రబాబు పర్యటనలో రాజకీయ చర్చలు కూడా చోటు చేసుకున్నాయని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఇటీవలి కాలంలో బయటపడుతున్న స్కాములు.. జగన్ పాలనలో చేసిన దోపిడీ గురించి పూర్తి స్థాయిలో ప్రధాని మోదీతో చంద్రబాబు చర్చించినట్లుగా చెబుతున్నారు. లిక్కర్ స్కామ్‌లో సీఐడీ దర్యాప్తుతో పాటు వేల కోట్ల నగదు లావాదేవీలు జరిగినందున ఈడీ విచారణకు సిఫారసు చేస్తామని స్వయంగా అసెంబ్లీలో ప్రకటించారు.

ఈ విషయాన్ని మోదీ దృష్టికి తీసుకెళ్లినట్లుగా చెబుతున్నారు. అలాగే బయటపడిన అనేక స్కాముల విషయంలో.. తీసుకోవాల్సిన చర్యల విషయంలోనూ.. కేంద్ర దర్యాప్తు సంస్థల జోక్యం అవసరమని అడిగినట్లుగా భావిస్తున్నారు. మరో వైపు జాతీయ రాజకీయాలపైనా చర్చించినట్లుగా తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాల రాజకీయంలో ఇటీవల కీలక మార్పులు వస్తున్నాయి. కొన్ని పార్టీల విలీనం.. మరికొన్ని పార్టీల పొత్తుల వ్యవహారాలు హాట్ టాపిక్ అవుతున్నాయి. అలాగే రాజ్యసభలో ఉపఎన్నికల తర్వాత ఎన్డీఏ మెజార్టీ సాధించనుంది. ఆ క్రమంలో ఎన్డీఏ అనుసరించాల్సిన వ్యూహంపైనా ప్రధాని మోదీతో చంద్రబాబు చర్చించినట్లుగా తెలుస్తోంది. చంద్రబాబు నాయు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధా నితో పాటు, పలువురు కేంద్ర మంత్రులను శనివారం సాయంత్రం కలిశారు. ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన చంద్రబాబు మోదీని సన్మానించి రాష్ట్రంలో చేపట్టిన పనుల పురోగతిని, అందుకు కేంద్రం నుంచి కావాల్సిన సహాయాన్ని కోరారు. ఈ సందర్భంగా ప్రధానికి వినతి పత్రం అందజేశారు.రాజధాని అమరావతి నిర్మాణం పూర్తికి, పోలవరం ప్రాజెక్టుకు ఇదివరకే ప్రకటించిన విధంగా ఆర్థిక సహాయాన్ని వెంటనే విడుదల చేయాలని చంద్రబాబు కోరారు. దాదాపు గంటపాటు ఇద్దరి మధ్య చర్చలు జరిగినట్లు సమాచారం . అనంతరం చంద్రబాబు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. వీరి మధ్య 40 నిమిషాల పాటు సమావేశం కాగా రాష్ట్రానికి అభివృద్ధి, సంక్షేమానికి భారీగా నిధులు కేటాయించాలని కోరారు. అక్కడే ఉన్న ఉక్కు, గనుల శాఖ మంత్రి కుమారస్వామితో చంద్రబాబు సమావేశమయ్యారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో అమరావతికి ప్రత్యేక సహాయంగా రూ.15 వేల కోట్లను ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# రోడ్డెక్కిన అన్నదాతలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. బ్యాంకు షెటర్ మూసి ధర్నాకు చేశారు. తమ రుణాలు మాఫీ చేయాలంటూ అధికారులతో రైతుల వాగ్వాదానికి దిగారు. దీంతో బ్యాంకు మేనేజర్ రైతులకు సర్దిచెప్పడంతో శాంతించారు. సాంకేతిక కారణాలతో కొందరు రైతులకు రుణాలు మాఫీ కాలేదని.. వారంతా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. 100 శాతం రుణాలు మాఫీ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. కొన్ని కారణాలతో పలువురు రైతులకు రుణాలు మాఫీ కాకపోయినా.. వారి ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అంశంపై బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ రూ. 2 లక్షల రుణమాఫీ పేరుతో అబద్ధపు రాజకీయాలు చేస్తోందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. 'ఎల్లుండి నుంచి క్షేత్ర స్థాయికి వెళ్తాం. గ్రామ స్థాయి నుంచి రుణమాఫీ కానీ రైతుల వివరాలు సేకరిస్తాం. ముఖ్యమంత్రి, మంత్రుల నియోజక వర్గాల మీద ప్రత్యేక దృష్టి పెడతాం. వివరాలన్నీ వ్యవసాయ శాఖ అధికారులకు, కలెక్టర్లకు అందజేస్తాం. ఆ తర్వాత సచివాలయంలో అధికారులకు ఇస్తాం. అయినా న్యాయం జరగకపోతే ప్రత్యక్ష పోరాటానికి దిగుతాం. రాష్ట్ర వ్యాప్తంగా 40 శాతం మాత్రమే రుణ మాఫీ జరిగింది. ఇంకా 60శాతం మంది రైతులకు కాలేదు. వారంతా వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

## మంకీఫాక్స్ అంటువ్యాధి..

(మొదటి పేజీ తరువాయి)

మరణించారు. ఇది అంటువ్యాధి కావడంతో ఆఫ్రికన్ విద్యార్థులు హైదరాబాద్ నగరంలో ఎక్కువగా ఉన్నందున డబ్ల్యూహెచ్ఓ హెచ్చరికతో హైదరాబాద్ వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఆఫ్రికాలో మంకీపాక్స్ వైరస్ కేసులు పెరుగుతుండటంతో ఆఫ్రికన్ యూనియన్ హెల్త్ వాచ్‌డాగ్ ప్రజారోగ్యశాఖ అత్యవసర పరిస్థితిని ప్రకటించింది.ఈ వైరస్ వ్యాప్తి పలు ఆఫ్రికన్ దేశాల్లో, డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో వ్యాపిస్తుంది.మంకీపాక్స్‌ను కాంటినెంటల్ సెక్యూరిటీ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటిస్తున్నామని ఆఫ్రికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ అధిపతి జీన్ కసేయా చెప్పారు.-ఆఫ్రికన్ విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి వచ్చి ఉన్నందున, ఈ అంటు వ్యాధి ప్రబల కుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.ఉన్నత విద్య అభ్యసించే ఆఫ్రికన్ విద్యార్థులకు హైదరాబాద్ ప్రముఖ గమ్య స్థానంగా ఉంది.డబ్ల్యూహెచ్ఓ హెచ్చరికతో హైదరాబాద్ వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో ఆఫ్రికన్ విద్యార్థులపై వైద్యులు దృష్టి సారించారు. ఆఫ్రికాలో 2022వ సంవత్సరంలో మంకీఫాక్స్ వ్యాధిని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ గుర్తించింది.ఈ వైరస్ మశూచి వంటి లక్షణాలతో కూడిన వైరల్ జూనోటిక్ వ్యాధి అని తేలింది. ఈ వైరస్ మంకీపాక్స్ వైరస్ వల్ల సంభవిస్తుంది.ఈ వ్యాధిని మొదటిసారిగా1958వసంవత్సరంలో కోతుల్లో కనుగొన్నారు. మొదటి మానవ కేసు 1970వ సంవత్సరంలో డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో వెలుగుచూసింది. 2003వ సంవత్సరంలో ఆఫ్రికా వెలుపల మొట్టమొదటి మంకీపాక్స్ వ్యాప్తి అమెరికాలో వెలుగు చూసింది. మంకీఫాక్స్ వైరస్ గాలి ద్వారా సంక్రమించే కోవిడ్‌లా కాదు. ఈ వైరస్ సోకిన వ్యక్తులతో ప్రత్యక్ష పరిచయం, లైంగిక సంపర్కం లేదా గాయాలతో సన్నిహిత సంబంధం ద్వారా మాత్రమే వ్యాధి సోకుతుంది. మంకీఫాక్స్ లక్షణాలు:మంకీఫాక్స్ వైరస్ లక్షణాలు శోషరస గ్రంథుల వాపు, జ్వరం, తలనొప్పి, శరీర నొప్పులు, తీవ్ర బలహీనతలుంటాయి. జ్వరం వచ్చిన 1-3 రోజులకు చర్మంపై దద్దుర్లు మొదలవుతాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గురువారం మంకీపాక్స్‌ను అంతర్జాతీయ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించడంతో, ప్రజలు ఈ వైరస్ ప్రమాద కారకాలు,ఎక్స్‌పోజర్‌ను తగ్గించే చర్యల గురించి తెలుసుకోవాల్సి ఉందని డాక్టర్లు చెబుతు న్నారు. ఆఫ్రికా దేశం నుంచి హైదరాబాద్‌కు విద్యార్థులు వచ్చినందున, మంకీఫాక్స్ వైరల్ ఇన్‌ఫెక్షన్ గురించి సాధారణ ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని హైదరాబాద్ నగరానికి చెందిన ఆశ్రిత ఆసుపత్రి డాక్టర్ రామ్మోహన్ రావు చెప్పారు.

## యధావిధిగా విద్యుత్ బిల్లులు చెల్లింపు

(మొదటి పేజీ తరువాయి)

ఫోన్‌పే, గూగుల్‌పే, అమెజాన్ పే, పేటీఎం ఇలా వివిధ డిజిటల్ పేమెంట్స్ ద్వారా బిల్లులు చెల్లించ వచ్చని పేర్కొన్నాయి. చేసిన తప్పు గ్రహించిన ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవడంతో అటు వినియోగదారులు కూడా హ్యాపీగా ఫీల్ అవుతున్నారు. విషయాన్ని అందరికీ తెలిసేలా విద్యుత్ శాఖాధికారులు చర్యలు తీసుకున్నారు. అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటనలు పెట్టారు. సోషల్ మీడియాలో కూడా పోస్టులు పెట్టారు.

## మట్టి వినాయకులనే పూజించండి

(మొదటి పేజీ తరువాయి)

మండపాలు ఏర్పాటు చేసుకునే వారంతా పోలీసులకు వివరాలు అందచేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు మట్టి విగ్రహాలు పెట్టాలని మండపాల నిర్వాహకులకు మంత్రి సూచనలు చేశారు. హీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నుంచి మట్టి విగ్రహాల పంపిణీపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా తీశారు. ఈ సమావేశానికి జీహెచ్ఎంసీ, పోలీస్, వాటర్ వర్క్స్, రెవెన్యూ, ఆర్ అండ్ బి తో పాటు ఇతర శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి, ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు కూడా సమావేశంలో పాల్గొన్నారు.హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం హుస్సేన్ సాగర్‌లో జరుగుతోంది. ఖైరతాబాద్ మహా గణపతి సహా ఇతర వినాయకుల నిమజ్జనం ఇక్కడే చేస్తుంటారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో భారీ గణనాథులను రూపొందిస్తారు. ఇప్పటికే సాగర్ కలుషితం అయ్యింది. వినాయక నిమజ్జనం నేపథ్యంలో మరింత కలుషితం అవుతోందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టులో పిటిషన్ కూడా వేశారు. సాగర్‌లో నిమజ్జనానికి గతంలో కోర్టు అనుమతించలేదు. ఇప్పటికిప్పుడు నిమజ్జనానికి ఏర్పాట్లు చేయడం కష్టం అవుతోందని చెప్పడంతో గత ఏడాది అవకాశం కల్పించారు. వినాయక నిమజ్జనంపై ఈ సారి హైకోర్టు ధర్మాసనం ఏ విధంగా స్పందించనుందో చూడాలి. నిమజ్జనానికి సంబంధించి హైకోర్టు ఆదేశాల ప్రకారం ముందుకెళ్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మరికొద్దిరోజుల్లో వినాయక చవితి రాబోతోంది. గణేశుడి పండగంటే అందరికీ ఎక్కడలేని ఉత్సహం వస్తుంది. చిన్న వినాయకుడి విగ్రహాల నుంచి భారీ వినాయక విగ్రహాలతో కూడిన మండపాలను వాడ వాడలా ఏర్పాటు చేస్తుంటారు యువత. గణపతి బప్పా మోరియా అంటూ చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఎంతో ఉత్సవాంగా వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పూజలు చేస్తుంటారు. ఈ క్రమంలో గణేశ్ ఉత్సవాలు రాబోతున్న తరుణంలో శనివారం నాడు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

## హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నతాధికారులతో సీఎం సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటుగా మంత్రివర్గ విస్తరణ, పీసీసీతో పాటు వివిధ కార్పొరేషన్‌లపై సీఎం సమీక్ష చేయనున్నారు. ఇందుకోసం రేవంత్ అధ్యక్షతన ఆదివారం ఐటీసీ కోహినూర్‌లో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. అలాగే ప్రభుత్వ పాలనపై ఈనెల 19 నుంచి వరుస సమీక్షలు నిర్వహించనున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన నుంచి వచ్చి రాగానే ఢిల్లీ పర్యటన చేయడం.. టీపీసీసీ చీఫ్, మంత్రి వర్గ విస్తరణ అంశాలు చర్చించడానికి అని జోరుగా వార్తలు వస్తున్నాయి. ఇదిలావుంటే జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హడ్కో ఛైర్మన్ సంజయ్ కులక్షేత్ర, ఇతర ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.

# రుణమాఫీపై తప్పుడు లెక్కలతో బురిడీ

(మొదటి పేజీ తరువాయి)

చేస్తానని ఇదే నోటితో చెప్పిండు. ఏమైంది? డిసెంబర్ 9 మాట తప్పిండు.ఇగ వట్టిగ డేట్లు చెబితే నమ్మరని పార్లమెంట్ ఎన్నికలు గట్టెక్కించుకోవడానికి, కనిపించిన దేవుడి మీదల్లా ఒట్లు పెట్టి, అదే నోటితో 31వేల కోట్లు ఆగస్టు 15 కల్లా చేస్తానన్నడు. బడ్జెట్ డాక్యుమెంట్‌లో 26వేల కోట్లు అని పెట్టిండు. నేను అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రశ్నించిన. మొదట 40వేల కోట్లన్నవు, తర్వాత 31 వేల కోట్లన్నవు, బడ్జెట్ లోనేమో 26 వేల కోట్లు పెట్టినవ్ అని ప్రశ్నించిన. ఏ రైతులను తీసేస్తున్నవ్, ఎందుకు తీసేస్తున్నవ్ అని నిలదీశిన. రైతు రుణమాఫీ, రైతు భరోసా మీద చర్చ పెట్టాలని పట్టుపట్టిన. పెడతా అని చెప్పి ముఖం చాటేసి పారిపోయిండు. మొన్న ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నాడు రుణమాఫీ అయిపోయిందని ప్రకటించిండు. సరే చేసిండేమో అనుకొని లెక్కలు చూస్తే, కేవలం 17వేల కోట్లతో 22లక్షల మందికి చేసిండని లెక్క తేలింది. అసెంబ్లీ ఎన్నికలప్పుడు 40వేల కోట్లు చెప్పి, తీరా చేసింది ఎంతంటే 17వేల కోట్లు. అంటే 23వేల కోట్లు కోత పెట్టిండు.

క్యాబినెట్ మీటింగ్ నాడు, పార్లమెంట్ ఎన్నికల నాడు చెప్పిన 31వేల కోట్లతో పోలిస్తే 14వేల కోట్లు కోత పెట్టిండు.

బడ్జెట్ కేటాయింపుల్లో చెప్పిన 26 వేల కోట్లతో పోలిస్తే 9 వేల కోట్లు కోత పెట్టిండు. పార్లమెంట్ ఎన్నికలపుడు రైతుల సంఖ్య 47 లక్షలు అని చెప్పిండు. మొత్తంగా మూడు విడతలకు 22 లక్షల మంది రైతులకు చేసిండు. అంటే చెప్పిన సంఖ్యకు సగం కూడా చేయలేదు. లెక్కచేస్తే 46శాతం మంది రైతులకే చేసినట్లు తేలుతున్నది. సుమారు 25లక్షల మంది రైతులకు ఎగనామం పెట్టినట్లు తన రికార్డులే చెబుతున్నాయి.ఈ పాటి పోటు పనికి సిగ్గులేకుండా తను తన వందిమాగదులు కలిసి రుణమాఫీ చేసినం అని చెప్పుకుంటూ చంకలు గుద్దుకుంటున్నరు.

రేవంత్ రెడ్డిది నోరా మోరా? చెప్పెటోనికి చెవుడైనా వినేటోనికి వివేకం ఉంటది కదా? మొదటి దఫా మేము లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తేనే 36లక్షల మంది రైతులకు 17వేల కోట్ల ప్రయోజనం చేకూరింది. మీరు రెండు లక్షల రుణమాఫీ చేస్తే రైతుల సంఖ్య పెరగాలె, డబ్బులు డబుల్ కావాలె. అటువంటిది రైతుల సంఖ్య దాదాపు 14లక్షలు ఎట్ల తగ్గింది? డబ్బు గదే 17 వేల కోట్లకు అటు ఇటుగా ఉన్నది. ఎవర్ని మభ్యపెడుతున్నరు ఏమనుకుంటున్నరు? ఎవర్ని మోసం చేస్తున్నరు? పట్టపగలు నట్టనడి బజార్ల నిట్టనిలువున రైతులను ముంచి పారేసినవ్. నువ్వు నిజంగనే రైతు రుణమాఫీ అయ్యిందనుకుంటున్నవా? రేవంత్ రెడ్డి నేను మళ్లీ సవాల్ విసురుతున్నా. రైతులందరికి రుణమాఫీ అయ్యిందని దమ్ముంటే నిరూపించు.

ప్లేసు, డేటు, టైము నువ్వే చెప్పు. ఏ జిల్లాకు పోదాం, ఏ నియోజక వర్గానికి పోదాం, ఏ మండలానికి పోదాం, ఏ గ్రామానికి పోదాం. నీ నియోజకవర్గం లేదా నా నియోజక వర్గం.. ఎక్కడికైనా పోదాం. నేనంటున్నది కరెక్టో, నువ్వంటున్నది కరెక్టో ఖుల్లం ఖుల్లా తెలుస్తది. నీ ప్రకటనల డొల్లతనం కూడా బయట పడుతది. వస్తవా? పోదామా రేవంత్ రెడ్డి? నేను నీలాగా మాట తప్పెటోడిని కాదు. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి, పార్టీలు మారి ముఖ్యమంత్రి అయిన చరిత్ర కాదు నాది.

తెలంగాణ ఉద్యమం నుంచి వచ్చినోడిని, ప్రజల కోసం, తెలంగాణ రాష్ట్రం కోసం పదవులు లెక్కపెట్టకుండా రాజీ నామాలు చేసినోడిని. నువ్వు చంద్రబాబు చంకల జొర్రి రైఫిల్ పట్టుకున్న నాడు నేను ప్రజల కొరకు రాజీనామా చేసినవాడిని.

రుణమాఫీ చేసిన, రాజీనామా అని రంకెలేస్తున్నవ్ రేవంత్ రెడ్డి. నేను చాలా స్పష్టమైన సవాల్ విసిరిన. ఆగస్టు 15 లోపు రైతులందరికి 2లక్షల రుణమాఫీ చేసి, ఆరు గ్యారెంటీల్లోని 13హామీలను సంపూర్ణంగా నెరవేరిస్తే నేను రాజీనామాకు సిద్ధమని ప్రకటించిన. ప్రజలకు నువ్వు ఇచ్చిన హామీ నెరవేరితే చాలు.. పదవి ఉంటే ఎంత పోతే ఎంత అనుకున్నా. ఆరు గ్యారెంటీల సంగతి పక్కన పెట్టు. కనీసం రుణమాఫీ మాటను కూడా నెరవేర్చుకోలేకపోయావు. అడ్డంగా దొరికిపోయావు. నేను అనుకున్నట్లుగానే రుణమాఫీ పేరిట రైతుల నెత్తిన కాంగ్రెస్ టోపి పెట్టినవ్. ఇది కవర్ చేసుకోవడానికి ముఖ్యమంత్రి పదవి స్థాయిని దిగజార్చుతూ రోత ప్రచారం మొదలు పెట్టినవ్.

మభ్యపెట్టి మతలబు చేసి ఎక్కువ రోజులు అందరిని నమ్మించలేవు. రైతన్నను దగా చేసిన నీ తీరును యావత్ ప్రజానీకం గమనిస్తున్నది.

అధికారంలోకి వచ్చేది మేమే. 2లక్షల రుణాలు తెచ్చుకొండి అని రెచ్చగొట్టినవ్. తీరా అధికారంలోకి వచ్చి 8 నెలల గడిచాక రుణమాఫీకి గండి కొట్టినవ్. అధికారం దక్కించుకునేందుకు మోసం. దక్కిన అధికారాన్ని నిలుపుకునేందుకు మరో మోసం. నీ 8 నెలల ప్రయాణమంతా మోసాల చరిత్రనే రేవంత్ రెడ్డి. బిఆర్ఎస్ పార్టీ తొమ్మిదన్నరేండ్ల కాలంలో 70వేల కోట్లు రైతు బంధు కింద, 30వేల కోట్లు రుణమాఫీ కింద మొత్తం లక్ష కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది. నువ్వు మాత్రం ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టి, అధికారంలోకి వచ్చాక ఉసూరుమనిపించినవ్. రైతులకు రైతు భరోసా అన్నవ్, రైతు కూలీలకు అన్నవు, కౌలు దారులకు అన్నవ్ అందరికి ఎగనామం పెట్టినవ్. రైతు బంధు పైసలు ఎగ్గొట్టి, ఆ పైసలు ఇటు డైవర్ట్ చేసి తూతూ మంత్రంగా రుణమాఫీ చేసి డప్పు కొట్టుకుంటున్నవ్, డబ్బా వాయిస్తున్నవ్. రైతు బంధు డబ్బులు డైవర్ట్ చేసినవ్. ఆగస్టు 6న తెలంగాణ భవన్ లో రుణమాఫీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసినం. ఫోన్ కాల్స్, వాట్సప్ ద్వారా గడిచిన 10, 11 రోజుల్లో లక్ష 16 వేల ఫిర్యాదులు వచ్చినయ్. రుణమాఫీ కాలేదు న్యాయం చేయండని రైతులు ఆవేదన చెందుతున్నరు. ఊళ్లల్లకు పోతే రైతన్నలు కన్నీళ్లు పెట్టుకుంటున్నరు. రుణమాఫీ కోసం అగ్రికల్చర్ ఆఫీస్, బ్యాంకుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగు తున్నరు. అధికారుల కాళ్ల వేళ్ల మీద పడి వేడుకుంటున్నరు. ఓపిక నశించి బ్యాంకుల ముందు నిరసన తెలుపుతున్నరు. ఇదంతా అబద్ధమా రేవంత్ రెడ్డి. రోజూ పత్రికల్లో, టీవీల్లో వస్తున్నవే కదా. రైతుల ఆవేదన ఈ ప్రభుత్వానికి ఎందుకు కనిపించడం లేదు. ఒకవైపు రైతు బంధు రాక, మరోవైపు మీరు రుణ మాఫీ చెయ్యక రాష్ట్రంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం కళ్లు, చెవులు, నోరు లేనట్లు వ్యవహరిస్తున్నది. దమ్ముంటే రుణమాఫీ మీద శ్వేత పత్రం విడుదల చేయండి. రైతులు ఎందరు? అప్పు ఎవరికి ఉంది. ఎంత డబ్బుఖాతాల్లో జమ అయ్యింది బయట పెట్టండి.

ఒక్క విషయంలో మాత్రం నిన్ను ఒప్పుకోవాలి రేవంత్ రెడ్డి. పరిపాలనలో ఫ్లాప్. తొండి చేయడంలో తోపు. బూతులు మాట్లాడంలో టాపు. ఇందులో ఎవరికి అనుమానం లేదు.రుణమాఫీ చేయలేక చేతులెత్తేసినందుకు నువ్వు రాజీనామా చేయాల్సింది పోయి, సిగ్గులేక చోర్ ఉల్టా కొత్వాల్ కో డాంట అన్నట్లు నన్ను రాజీ నామా చేయమంటున్నారు. రుణమాఫీలో కోత మాటలేమో రోత. ఇది నీ వైఖరి. బూతులు తిడితే రుణమాఫీ అయి పోతుందా? ఖాతాల్లో డబ్బులు పడతాయా? తొండి చేసుకుంట మొండిగ మాట్లాడుతున్నవ్.

రంకెలేస్తే అంకెలు మారిపోవు. అబద్దాలు నిజమైపోవు. మమ్మల్ని తిట్లు తిడుతవ్ కావొచ్చు, కానీ దేవుడి మీద పెట్టిన ఒట్లు ఎట్ల మర్చిపోతవు. రేవంత్ రెడ్డి ఏమన్నడు. ఎన్ని దేవా లయాల మీద ఒట్లు వేసిండు? యాదగిరి గుట్ట లక్ష్మీనర్సింహా స్వామి సాక్షిగా.. రామప్ప దేవాలయం శివుడి సాక్షిగా, సమ్మక్క సారలమ్మ సాక్షిగా, వెయ్యి స్తంభాల గుడి సాక్షిగా.. జోగులాంబ సాక్షిగా.. బాసర సరస్వతి మందిరం సాక్షిగా.. కొమురవెల్లి మల్లన్న సాక్షిగా.. జూబ్లీహిల్స్ పెద్దమ్మ సాక్షిగా.. కురుమూర్తి సాక్షిగా..సిద్దుల గుట్ట సాక్షిగా.. అనంతగిరి కొండల్లో ఉన్న పద్మనాభుడి సాక్షిగా.. పాలమూరు ప్రజల సాక్షిగా, జహంగీర్ పీర్ దర్గా సాక్షిగా... సేవాలాల్ సాక్షిగా, బాపూజీ సాక్షిగా... మెదక్ చర్చ్ సాక్షిగా... ఏడు పాయల దుర్గమ్మ సాక్షిగా.. అంటూ గుడి, చర్చి, మసీద్ సాక్షిగా ఒట్లు వేసి రుణమాఫీ అమలు చేస్తానని మాట తప్పిండు.

హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు నమ్ముకున్న దేవుళ్లను కూడా రేవంత్ మోసం చేసిండు. రైతులనే కాదు, దైవ ద్రోహానికి పాల్పడ్డడు. పాలకుడిగా నువ్వు పాపం మూటగట్టుకున్నవు. రాష్ట్రానికి ఎక్కడ లత్తగొడుతదో అని ప్రజలు భయపడు తున్నరు. రైతులకు తీరని ద్రోహం చేసినవ్, దేవుళ్లకు తీవ్రమైన అపచారం చేసినవ్. దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి మాట తప్పిన పాపం ఊరికే పోదు అది రాష్ట్రానికి చుట్టుకుంటుంది. ఊర్లల్ల అదే భయ పడుతున్నారు. దేవుళ్ళ మీద నిజమైన భక్తి ఉన్న ప్రతి వ్యక్తి నువ్వు చేసిన పాపం చూసి భయ పడుతున్నాడు.

నువ్వా ప్రాయశ్చిత్తం చేసుకోవు. నీ పాపం ప్రజలకు శాపం కావద్దని నేను తీర్థ యాత్రకు బయలుదేరుతా. మా పార్టీ సీనియర్ నాయకులు కూడా వస్తారు. ముక్కోటి దేవతల్ని, అల్లా, జీసస్ లను వేడుకుంటా.ఈ పాపాత్ముడు చేసిన తప్పుకు ప్రజలకు కీడు చేయొద్దని వేడుకుంటా. ప్రైమరీ స్కూల్ పిల్లలు కూడా రుణమాఫీ అయ్యిందా లేదా చెబుతరు.

ఎంత మంది ఉండే, ఎంత మందికి వచ్చింది సింపుల్. అది చెప్పలేక, సిగ్గులేదని, జాతి అని మాట్లాడుతారు. సీఎం ఇలా మాట్లడచ్చునా? మేము ఇంతకంటే ఎక్కువ మాట్లాడతాం. ప్రశ్నిస్తే చావాలని మాట్లాడుతున్నారు. నీ గాడ్ ఫాదర్స్‌కి భయపడలేదు. నీ తాటాకు చప్పుళ్లకు బయపడం మిస్టర్ రేవంత్ రెడ్డి. రుణమాఫీ విషయంలో మాట తప్పావ్ ఫెయిల్ అయ్యావు. రుణమాఫీ రైతులందరికి చేసే దాకా, రైతు భరోసా ఇచ్చేదాకా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, రేవంత్ రెడ్డిని వదిలిపెట్టేది లేదు. బీఆర్ఎస్ పక్షాన పోరాటం చేస్తాం. మరో రైతాంగ ఉద్యమానికి శ్రీకారం చుడతాం. పార్టీ తరుపున త్వరలో కార్యాచరణ ప్రకటిస్తాం. రైతుల తరుపున పోరాటం చేస్తం.

## చిన్న మంగళారం నుంచి వీరన్నపేట్ రోడ్డు గుంతలు లేకుండా మరమ్మత్తులు


**మొయినాబాద్ ఆగస్టు 17 (నమస్తే ఉదయం):** మండల పరిధిలోని చిన్నమంగళారం నుంచి వీరన్నపేట్ వెళ్లే దారిని గత రెండు మూడు నెలల నుండి కురుస్తున్న వర్షాలకు వర్షాకాలం కావడంతో వర్షపు నీటికి మీటర్ లోతు గుంతలు పడడంతో వాహనదారులకు గ్రామస్తులకు ఎంతో ఇబ్బంది మారింది ప్రభుత్వాలు మారిన రోడ్డు మారడం లేదని నేను చేయిస్తానని తన సొంత నిధులతో మరమ్మతులు



చేయించిన జరిగింది ఈ మరమ్మతులకు అయ్యే ఖర్చు చిన్నమంగళారం గ్రామ యువ నాయకులు మాజీ ఏఎంసి డైరెక్టర్ అవిశిపేట ఆంజనేయులు గౌడ్ తన సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... చిన్న మంగళారం గ్రామానికి చేసింది చాలా తక్కువ అని చేయాల్సింది చాలా ఉందని చిన్న మంగళవారం గ్రామ ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానని నా కంఠంలో ప్రాణము ఉన్నంతవరకు చిన్న మంగళారం గ్రామ ప్రజల కోసం శాయ శక్తుల కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాయకులు యువకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## 28 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**గద్వాల(కేటిదొడ్డి),ఆగస్టు17(నమస్తే ఉదయం):** అక్రమంగా తరలిస్తున్న 28 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శనివారం కేటిదొడ్డి పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రావు తెలిపారు. కేటిదొడ్డి ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేటిదొడ్డి మండలానికి చెందిన షరీఫ్,వీరేంద్ర, రవి లు గద్వాల పట్టణంలో లబ్దిదారుల నుంచి





తక్కువ ధరకు కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని అధిక ధరకు విక్రయించడానికి అక్రమంగా రాయచూరుకు తరలిస్తున్న క్రమంలో నందిన్నె చెక్ పోస్టు వద్ద బొలేరో వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. అందులో ఉన్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## పార్థీనియం నిర్మూలనపై అవగాహన సదస్సు

**రాజేంద్రనగర్, ఆగస్ట్ 17(నమస్తే ఉదయం):** పార్థీనియం అవగాహన వారోత్సవాల సందర్భంగా శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో పార్థీనియం నిర్మూలన పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు . ఈ సదస్సులో పార్తీనియం నిర్మూలన ప్రాముఖ్యత దీని వల్ల పంటలకు జరిగే నష్టాలు అది వ్యాప్తి చెందే



విధానం, పార్థీనియం నిర్మూలనకు తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు విద్యార్థులకు వివరించడం జరిగింది. ముఖ్యంగా ఈ కలుపు మొక్కని నియంత్రించడానికి పాటించే వివిధ యాజమాన్య పద్ధతులు, జీవ నియంత్రణ, రసాయనిక పద్ధతులు మొదలగు వాటి గురించి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి పద్మజ వివరించారు. ఈ కలుపు మొక్క పంటలకే కాకుండా మానవులకు అలాగే పశువుల ఆరోగ్యానికి హానికరం అని ఆమె వివరించారు. పెద్ద ఎత్తున ఉద్యమ స్ఫూర్తితో ఈ కలుపు మొక్కను నిర్మూలించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్ , హెడ్. డాక్టర్. యాకాద్రి, ఎన్ఎస్ఎస్ విభాగ అధికారులు డాక్టర్ శ్రీలత, డాక్టర్ శ్రీ రంజిత, డాక్టర్ అరుణ, డాక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన మదనపల్లి శనీశ్వర స్వామి దేవాలయం

### - స్వామివారిని దర్శించుకున్న తన్వి రాజు

**శంషాబాద్,ఆగస్టు 17( నమస్తే ఉదయం):** పవిత్రమైన శ్రావణమాసంలో వచ్చిన శని త్రయోదశి సందర్భంగా మదనపల్లి లోని శ్రీ శనీశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శనివారం తెల్లవారుజాము నుండి భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరి నిల్చున్నారు. శంషాబాద్ మండలంలోని మదనపల్లి గ్రామంలో శ్రీ గిరి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ శనీశ్వర స్వామి దేవాలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కోయదొర శంకర రాజు ముఖియా నేతృత్వంలో ఆలయానికి వచ్చే భక్తులకు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ శంషాబాద్ మాజీ జెడ్పిటిసి నీరటి తన్వి రాజు ముదిరాజ్ కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనీశ్వర స్వామి పూజల అనంతరం ఉమామహేశ్వరుల దర్శనం చేసుకున్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి వారికి తైలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు.





మాజీ జెడ్ పి చైర్ పర్సన్ సరిత ఇంట్లో సమావేశమైన మంత్రి జూపల్లి కృష్ణారావు,



మంత్రి జూపల్లి కృష్ణారావు కాన్వాయ్‌ని అడ్డుకున్న సరిత వర్గీయులు

## మంత్రి జూపల్లి కాన్వాయ్‌ను అడ్డుకున్న మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వర్గీయులు

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు17(నమస్తే ఉదయం):** గద్వాల నియోజకవర్గంలో ప్రాజెక్టుల సందర్శనకు వచ్చిన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు చేదు అనుభవం తగిలింది. తమ నాయకురాలు మాజీ జెడ్పీ చైర్పర్సన్ సరిత తిరుపతయ్యకు ప్రాజెక్టుల సందర్శనపై ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో సరిత వర్గీయులు మంత్రి జూపల్లి కాన్వయ్ ను అడ్డుకున్నారు.

దీంతో అక్కడ కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. చివరికి మంత్రి మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత నివాసానికి చేరుకోవడంతో గందరగోళానికి తెరపడింది. వివరాలలోకి వెళితే శనివారం గద్వాల నియోజకవర్గంలోని జూరాల ప్రాజెక్టు, గట్టు ఎత్తిపోతల పథకంతో పాటు ర్యాలంపాడు, నెట్టెంపాడు రిజర్వాయర్‌ల సందర్శనకు మంత్రి జూపల్లి విచ్చేశారు. మంత్రితో పాటు ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదిత్య ఈ పర్యటనలో పాల్గొన్నారు.

గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నివాసం నుంచి బయలుదేరిన మంత్రిని మాజీ జెడ్పీచైర్ పర్సన్ సరిత వర్గీయులు ఎమ్మెల్యే నివాసం కూతవేటు దూరంలో అడ్డుకునేందుకు ప్రయత్నం చేశారు. మంత్రి జూపల్లి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ కాన్వాయ్‌కి అడ్డంగా నిలిచారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాల మద్య ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అక్కడిచేరుకున్న పోలీసులు ఆందోళన కారులను చెదరగొట్టారు. కాగ బీఆర్ఎస్ పార్టీ కి చెందిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఆ పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరేందుకు సిద్ధమైన తరుణంలో మొదట మాజీ జెడ్పి చైర్ పర్సన్ సరితతో పాటు ఆమె అనుచరులు తీవ్రంగా వ్యతిరేకించారు. అదిష్టానం సూచన మేరకు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో గద్వాల ఎమ్మెల్యే చేరారు. శనివారం ప్రాజెక్టు సందర్శనకు గద్వాలకు విచ్చేసిన మంత్రి జూపల్లి మొదట గద్వాల ఎమ్మెల్యే బండ్ల నివాసంలో బసచేశారు. అక్కడి నుంచి ప్రాజెక్టుల సందర్శనకు బయలుదేరిన మంత్రి జూపల్లి కాన్వాయ్ ని మాజీ జడ్పీ చైర్పర్సన్ సరిత వర్గీయులు అడ్డుకున్నారు. మంత్రి కాన్వాయ్‌ను వెంబడించడంతో మాజీ జడ్పీ చైర్ పర్సన్ సరిత నివాసం రావాల్సిందిగా పట్టుబడ్డడంతో చేసేది ఏమి లేక మంత్రి జూపల్లి సరిత నివాసంకు బయలుదేరారు. సరిత నివాసంలో తేనేటి విందు స్వీకరించి మంత్రి జూపల్లి అక్కడ ఆమెతో పాటు ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఏ ఏ విషయాలపై చర్చించారు? మంత్రి కాన్వాయ్ ను ఎందుకు అడ్డుకోవల్సిందే గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. అనంతరం ప్రాజెక్టుల సందర్శనకు మంత్రి బయలుదేరారు. గద్వాల నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాలు ఏర్పడటంతో అధిష్టానాన్నికి తలనొప్పిగా మారిందని తెలుస్తోంది. అనంతరం ప్రాజెక్టుల సందర్శనకు మంత్రితో పాటు గద్వాల ఎమ్మెల్యే, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ కలిసి వెళ్లారు.

## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

### – ఏరువ కుమారస్వామి

**రాజేంద్రనగర్, ఆగస్ట్ 18(నమస్తే ఉదయం):** అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య అనురాగ బంధానికి ప్రతీక రక్షాబంధన్ అని నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రక్షా బంధన్ పండుగ సందర్భంగా నవ యువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లి సెక్టార్ బాబుల్ రెడ్డి నగర్ అంగన్వాడీ కేంద్రం లో శనివారం రక్ష బంధన్ వేడుకలను నిర్వహించారు.

చిన్నారులకు రాఖీలు కట్టించడం జరిగింది. ఒకరికి ఒకరు స్వీట్లు తినిపించుకున్నారు. అదేవిధంగా అంగన్వాడి కేంద్రాలలో వారాంతంలో భాగంగా ప్రతి శనివారం రోజు జరుపుకుని ప్రకృతి సంరక్షణ యాక్టివిటీ దీనిలో భాగంగా అంగన్వాడి పిల్లలకు చెట్లు, పువ్వులు, పచ్చదనంపై చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమార స్వామి, ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి, అంగన్వాడీ టీచర్లు అనిత, మాధవి, లక్ష్మి సంగీత, వినయ్ పాల్గొన్నారు.





ర్యాలం పాడు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



రిజర్వాయర్ ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

## గద్వాల నియోజకవర్గం ప్రాజెక్టులను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు17(నమస్తే ఉదయం):** గద్వాల నియోజకవర్గంలోని ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా ధరూర్ మండల పరిధిలోని ర్యాలంపాడు రిజర్వాయర్ ను గట్టు ఎత్తిపోతల పథకం, గూడెందొడ్డి రిజర్వాయర్‌లను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రభుత్వ సలహాదారులు ఆదిత్యనాథ్ ,మాజీ ఛైర్మన్ సరిత ప్రాజెక్టులను సందర్శించి పరిశీలించారు.

ర్యాలంపాడు రిజర్వాయర్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ప్రభుత్వ సలహాదారులు రిజర్వాయర్లు, ఆయకట్టును క్షుణ్ణంగా పరిశీలించారు.

గద్వాల నియోజకవర్గంలోని రిజర్వాయర్లలో భూనిర్వాసితులు ఆలూరు, రేలంపాడు, నాగర్ దొడ్డి నెట్టెంపాడు, గార్లపాడు, చిన్నోనిపల్లి గ్రామాలలోని ప్రజల త్యాగ ఫలితంతో నే రిజర్వాయర్లను ఏర్పాటు చేయడం జరిగిందని వారికి రావాల్సిన భూ నిర్వాసిత ప్రజల సమస్యలను పరిశీలించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ప్రభుత్వ సలహాదారునికి వినతిపత్రం రూపంలో అందజేశారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ...

గద్వాల నియోజకవర్గంలోని రైతాంగం పుష్కలమైన నీటిని అందించే విధంగా వారికి రెండు పంటలు కూడ ఎలాంటి నీటి కొరత లేకుండా చివరి ఆయకట్టు వరకు నీరు అందించే విధంగా నేడు ర్యాలంపాడు రిజర్వాయర్‌లో నాలుగు టీఎంసీల కెపాసిటీ కలిగి ఉన్న రిజర్వాయర్ ప్రస్తుతం 1.5 కెపాసిటీతో ఉన్నది దీనితో రైతులకు సరైన నీళ్లు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపుగా 700 మీటర్ల వరకు లీకేజీల ప్రాబ్లమ్ ఉండడంతో రైతులకు చుట్టుపక్క ఉన్న ప్రాంతాలకు ఎప్పుడైనా ప్రమాదం జరగవచ్చునని వాటిని త్వరగా పరిష్కరించి నీటి సామర్థ్యాన్ని పెంచే విధంగా కృషి చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి తరఫున ఇరిగేషన్ ప్రభుత్వ సలహాదారును ప్రాజెక్టులను పరిశీలించడానికి వాటిని త్వరగా పూర్తి చేయ డానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి నాలుగు టిఎంసిలతో ఉన్న ఈ ప్రాజెక్టును 10 టి.ఎం.సిలుగా ఏర్పాటు చేసి నీటి సామర్థ్యాన్ని పెంచాలని కోరారు.

గట్టు ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణం కొనసాగుతుంది ప్రస్తుతం రెండు టీఎంసీలు మాత్రమే కెపాసిటీ ఉన్నది. దీని నీటి సామర్థ్యాన్ని పెంచాలి. 20 టీఎంసీల వరకు నీటి సామర్థ్యాలు పెంచే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నీటి నిల్వ కోసం రైతులకు రెండు పంటలకు నీళ్లు అందించడానికి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ద్వారా రిజర్వాయర్లకు, కాలువలకు నీటిని అందచేయడం జరుగుతుంది. కర్ణాటక రాష్ట్రంలోని ఆల్మట్టి నారాయణపూర్ డ్యాంలలోని నీటిని విడుదల చేయడం వల్ల ఒక టీఎంసీ రెండు టీఎంసీలను వారికి విజ్ఞప్తి చేసి నీటిని విడుదల చేసుకోవడం జరుగుతుంది. దీనివల్ల తాగునీరు లభిస్తుంది. ఇలాంటి పరిస్థితి భవిష్యత్తులో ఉండరాదు అంటే మనను ర్యాలంపాడు గట్టి పోతల పథకం గుడ్డెం దొడ్డి రిజర్వాయర్లను నీటి సామర్థ్యాన్ని పెంచుకోవడం వల్ల దాదాపుగా లక్ష 50 వేల ఎకరాలకు రెండు పంటలకు రైతులకు చివరి ఆయకట్టు వరకు నీటిని అందించడం దానికి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

త్వరలోనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రిజర్వాయర్లలో లీకేజీ ప్రాబ్లంలు లేకుండా పూర్తి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తూ ఈ ప్రాంతంలోని రైతాంగానికి నీటి నిలువ సామర్థ్యాన్ని పెంచే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

ప్రభుత్వ సలహాదారులు మాట్లాడుతూ..

గద్వాల నియోజకవర్గ రైతాంగ అభివృద్ధి కొరకు సీఎం ప్రత్యేక దృష్టిని వహించారు. ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి కోరినట్లే ఈ ప్రాంత రైతాంగ కొరకు రిజర్వాయర్లు లీకేజీ ప్రాబ్లంను వెంటనే పరిష్కరించి రిజర్వాయర్లు నీటి సామర్థ్యాన్ని పెంచే విధంగా ఇరిగేషన్ ఇంజనీరులతో పర్యవేక్షించి ఏ విధంగా అయితే నీటి సామర్థ్యాన్ని పెంచే విధంగా అవకాశం ఉంటుందో ఆ వెంటనే త్వరగా పూర్తిచేసి రైతాంగానికి రెండు పంటలకు సాగునీరు అందించే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

అదేవిధంగా గతంలో ర్యాలంపాడు, గుడ్డెం దొడ్డి, గట్టు ఎత్తిపోతల పథకం రిజర్వాయర్లను భూములను కోల్పోయిన వారిని, భూ నిర్వాసితులకు త్వరలోనే న్యాయం చేసే విధంగా వారి త్యాగాన్ని ప్రభుత్వం వారికి ఆదుకొని అండగా ఉండే విధంగా కృషి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దృష్టికి తీసుకువెళ్లి మీ సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ....

గద్వాల నియోజకవర్గ రైతాంగం కోసం రెండు పంటలకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే కొరకు ముందుగా ర్యాలంపాడు రిజర్వాయర్లలోని లీకేజీ సమస్యలను పరిష్కరించి ర్యాలంపాడు పై రిజర్వాయర్ నీటి సామర్థ్యం నాలుగు టీఎంసీల నుండి పది టీఎంసీల కెపాసిటీ పెంచే విధంగా కృషి చేయాలని ప్రభుత్వం సీఎం గారి దృష్టికి తీసుకు వెళ్లడంతో శనివారం మంత్రి, ప్రభుత్వ సలహాదారులు ఈ ప్రాంతంలో రిజర్వాయర్లను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. గట్టు ఎత్తిపోతల పథకంను కూడా నీటి సామర్థ్యాన్ని పెంచడం వల్ల ఎడారిగా ఉన్న గట్టు మండలంలోని గట్టు, కేటీ దొడ్డి ప్రాంత రైతాంగానికి నీటి సమస్య లేకుండా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడం కొరకు రెండు టీఎంసీల నుంచి 20 టీఎంసీల కెపాసిటీని పెంచే విధంగా కృషి చేయాలని కోరారు. భవిష్యత్తులో 50 సంవత్సరాల దాకా ఎలాంటి నీటి సమస్య లేకుండా శాశ్వతమైన పరిష్కారం చేసి రైతుల అభివృద్ధి కోసం కృషి చేయాలి రైతు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## నిందితులను కఠినంగా శిక్షించాలి

### అమ్మాయిలపై దాడులను అరికట్టాలి.

### ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ర్యాలీ

**శంషాబాద్, ఆగస్టు 17( నమస్తే ఉదయం):**
పశ్చిమ బెంగాల్లోని కోల్ కత నగరంలో ఆర్జిగర్ ప్రభుత్వ ఆస్పత్రి, మెడికల్ కాలేజ్ లొ పనిచేస్తున్న మహిళా జూనియర్ డాక్టర్ పై అమానుషంగా లైంగికదాడికి పాల్పడి.. హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం శంషాబాద్ పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. నిందితులందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కే వై ప్రణయ్. ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఆనంద్డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులు సంధ్య,తరుణ్, తనిష్క, అర్జున్ ఎన్ఎస్‌యుఐ నాయకులు మణికంఠ, అభిషేక్ గౌడ్, వర్ధన్, జగదీష్, అజయ్ విద్యార్థులు పాల్గొన్నారు

## దోమల నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

### - కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్

**రాజేంద్రనగర్, ఆగస్ట్ 17(నమస్తే ఉదయం):**
దోమల నివారణకు జిహెచ్ఎంసి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఎం సంగీత గౌరీ శంకర్ కోరారు. శనివారం



మూసిలో గుర్రపు డెక్క తొలగింపు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత

అత్తాపూర్ డివిజన్ పరిధి మూసి నదిలో అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ గుర్రపు డెక్క పనులు అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సంగీత మాట్లాడుతూ... మూసి లో గుర్రపు డెక్క పెరుగుతుండడం వల్ల దోమల బెడద తీవ్రంగా ఉందని దీంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. వర్షాకాలం దోమలు ఉత్పత్తి చెంది ఇండ్లలోకి వ్యాపించి మలేరియా డెంగ్యూ ఇతర రోగాల బారిన ప్రజలు అల్లాడుతున్నారన్నారు. దోమల బెడద పై జోనల్ కమిషనర్ వెంకన్న దృష్టికి తీసుకెళ్లడంతో తెలియజేయడంతో సానుకూలంగా స్పందించి దోమల నివారణ కోసం జిహెచ్ఎంసి అధికారులుజెసిపి మనుషుల సహాయంతో ఈ గుర్రపుడెక్క తొలగించడం జరుగుతుంది .ఈ గుర్రపు డెక్క తీయడంతో రోజు సాయంత్రం దోమల నుంచి తదితర పరిసరాల ప్రజలకు ఇతర మూగజీవాలకు ఉపశమనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ రాజు లు పాల్గొన్నారు.

## వైద్య పీజీ విద్యార్థిని మౌమిత కుటుంబానికి న్యాయం చేయాలి

### - బిజెపి రాష్ట్ర నాయకురాలు ఉమామహేశ్వరి రెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు17(నమస్తే ఉదయం):**
కొలకత్తాలో పీజీ వైద్యురాలు డాక్టర్ మౌమిత పై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ శనివారం నగరంలోని ట్యాంక్ బండ్ స్వామి వివేకానంద విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరి రెడ్డి మాట్లాడుతూ...వైద్యురాలి పై సామూహిక అత్యాచారం చేసి హత్య




చేసిన నిందితులను సమగ్ర విచారణ జరిపి దోషులకు కఠినంగా శిక్షించాలి హాస్పిటల్ లో డాక్టర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలి డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టుమార్టం రిపోర్టును బహిర్గతం చేసి,సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, హాస్పిటల్లో డాక్టర్లకు కనీస సౌకర్యాలు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.




సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

### - జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శిదేవలపల్లి అశోక్ గౌడ్

**రాజేంద్ర నగర్, ఆగస్టు17(నమస్తే ఉదయం):**
మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్ధన్ అధ్యక్షతన డివిజన్ జరిగిన కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా ప్రధానకార్యదర్శి దేవలపల్లి అశోక్ గౌడ్, రాజేంద్ర నగర్ నియోజకర్గ బిజెపి కాంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి కార్యకర్తలకు సంస్థాగతంగా పార్టీ నిర్వహించే కార్యకలాపాలను, అదే విధంగా గత 6 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, ఏక్కడి పనులు కుంటి పడ్డాయి, ఇచ్చిన హామీలు నెరవేర్చడం లో ప్రభుత్వం విఫలమైంది అదేవిధంగా జిహెచ్ఎంసి నిధులు మంజూరు చేయకపోవడం వంటి విషయాలు కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి చర్చించడం జరిగింది.

ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ...ఈ కార్యవర్గ సమావేశంలో పలు కీలక తీర్మానాలను ప్రవేశ పెట్టడం జరిగింది. ముఖ్య ఉద్దేశం ప్రజా సమస్యల పరిష్కారానికి మనమందరం కలిసి కట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్య ఉద్దేశం రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా కష్టపడి పని చేయాలని పేర్కొనడం జరిగింది. మొన్న జరిగిన అసెంబ్లీ ఎలక్షన్స్ మరియు పార్లమెంట్ ఎలక్షన్స్‌లలో ఎవరు ఊహించని విధంగా భార తీయ జనతా పార్టీ ఏకంగా 8 సీట్లు గెలవడం చాలా శుభ పరిణామం అన్నారు. అదేవిధంగా కార్యవర్గ సమావేశంలో మన నియోజకవర్గం లోని స్థానిక డివిజన్ ఉన్న ప్రజాలు ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారానికి మనమందరం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్న మనమందరం వారికి అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేయవలసిన అవసరము ఎంతైనా ఉందన్నారు. గౌరవనీయు లైన దేశ ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి గడపగడపకు బలంగా తీసుకుని వెళ్లి కేంద్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించి, ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సందర్భంగా తెలియ జేయడం జరిగింది. పార్టీ నాయకులు కార్య కర్తలు భారతీయ జనతా పార్టీని బూత్ నుంచి సంస్థగతంగా అన్ని రంగాలలో బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయా లని సందర్భంగా తెలియ జేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి భారతీయ జనతా పార్టీకి రోజురోజుకీ ఆదరణ పెరుగుతుందని ప్రజలందరూ బిజెపి వైపు చూస్తున్నారని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం బిజెపి పార్టీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఆఫీసు కార్యదర్శి నవారు మురళీధర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.బుచ్చి రెడ్డి, జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ సి హెచ్ వెంకట రమణ, ఓబీసీ మోర్చ కోశాధికారి, సంతోష్ గౌడ్, బి. నరసింహ, టి.చిన్న, శ్రీకాంత్ రెడ్డి, నారోత్తం రెడ్డి, కె బాబు, గోపాల్ నాయక్, శ్రవణ్ కుమార్, మోహన్, మజ్ హార్, ఏ కిషోర్, సిహెచ్ ప్రభుదాస్, రామ రావు, సచిన్ షిండే, డివిజన్ మహిళా మోర్చ అధ్యక్షురాలు ఉడుత లక్ష్మి, అంజమ్మ, లలిత, అరుణ్ కుమార్, రాజా లింగం, కృపాకర్, కుర్మయ్య కుమార్, సురేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## శారదా ఎంటర్ప్రైజెస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

### జిల్లా కార్మిక శాఖ అధికారికి ఫిర్యాదు చేసిన సిఐటియు నాయకులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు17(నమస్తే ఉదయం ఉదయం):**
డిస్టిక్ లేబర్ కమిషనర్ శ్యాంసుందర్ కు శారద ఎంటర్ప్రైజెస్ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ మాట్లాడుతూ.... రాజేంద్రనగర్ మండలం ఉప్పరపల్లి రెడ్డి కాలనీలో ఉన్న త్రివికో శారద ఎంటర్ప్రైజెస్ కు సంబంధించిన ఆటోకు సంబంధించిన చార్జింగ్ పాయింట్ లో గత సంవత్సర కాలం నుండి పనిచేస్తున్నటువంటి వెంకటయ్య , సాయి తేజ్ అనే కార్మికులు 12 గంటలు పని చేయించుకుని కేవలం 16 వేల రూపాయలు వేతనం చెల్లించేవారు ఈనెల 1వ తేదీ నుండి అకస్మాత్తుగా విధుల్లో నుంచి తొలగిస్తున్నామని వారిని ప్రజలకు హాజరు కాకుండా బెదిరించి భయభ్రాంతులకు గురి చేయడం జరిగింది.

శారద ఎంటర్ప్రైజెస్‌కు సంబంధించినటువంటి బ్యాంక్ అకౌంటు వివరాలు పిఎఫ్ అకౌంట్ వివరాలతో కూడినటువంటి ఆధారాలతో కార్మికుడికి కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని రంగా రెడ్డి జిల్లా డిసిఎల్ శ్యాంసుందర్‌కి రాతపూర్వకంగా తమ ఉద్యోగం తమకు ఇప్పించాలని వినతి పత్రం అందజేశారు. విప్పించాలని ఈ కార్యక్రమంలో కార్మికుడు వెంకటయ్య పాల్గొన్నారు.



జిల్లా లేబర్ కమిషనర్‌కు వినతి పత్రం అందజే స్తున్న సిఐటియు నాయకులు

## కాంగ్రెస్‌వన్నీ డైవర్ట్ పాలిటిక్స్

### కెటిఆర్ వ్యాఖ్యలపై కావాలనే రాజకీయం

### అత్యాచారాలపై మహిళామంత్రుల స్పందన ఏదీ

### ఘాటుగా స్పందించిన బిఆర్ఎస్ మహిళా నేతలు

**హైదరాబాద్,ఆగస్ట్17(నమస్తే ఉదయం):**
అటెన్షన్ డైవర్ట్ పాలిటిక్స్ నడుపుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై బీఆర్ఎస్ మహిళా నేతలు తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. కేటీఆర్, హరిష్ రావులు టార్గెట్‌గా కాంగ్రెస్ చేస్తున్న కామెంట్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం నాడు ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునితా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ వాణిదేవిలు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. తొలుత సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ వ్యాఖ్యలపై కావాలనే రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. పొరపాటున మాట్లాడానని హుందాగా మహిళలకు క్షమాపణలు చెప్పారని గుర్తు చేశారు. కేటీఆర్ సంస్కారం గురించి కేసీఆర్‌పై మంత్రి సీతక్క మాట్లాడుతున్నారని.. కేసీఆర్ నేర్పించిన సంస్కారం ఏంటో కేటీఆర్ చెప్పిన క్షమాపణతో అర్థం అవుతోందని సబిత కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రంలో విద్యార్థులు, మహిళలపై జరుగుతున్న హత్యాచారాలపై మహిళా మంత్రులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారామె. షాద్‌నగర్ ఘటనపై మహిళా కమిషన్ ఎందుకు స్పందించడం లేదని సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీలో తమపై ముఖ్యమంత్రి చేసిన కామెంట్స్‌పై ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. పొరపాటున మాట్లాడానని ముఖ్యమంత్రి కనీసం మాటనైనా చెప్పకుండా రాక్షసానందం పొందారని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. సంస్కారవంతులు ఎవరో.. సంస్కారం హీనులు ఎవరో ప్రజలు చూస్తూనే ఉన్నారన్నారు. సీతక్క మీద సోషల్ మీడియా ట్రోల్స్‌పై స్పందించిన సీఎం.. తమపై చేసిన కామెంట్స్‌పై ఎందుకు స్పందించలేదని సబిత ప్రశ్నించారు. కేటీఆర్‌పై మాటల దాడి.. హరీష్ రావు క్యాంప్ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నామన్నారు సునీతా లక్ష్మారెడ్డి. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఇద్దరూ నిలదీసినందుకే వారిపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. మహిళల విషయంలో




కేటీఆర్ మాట దొర్లడంతో సారీ కూడా చెప్పారన్నారు. రాజకీయ లబ్ధి కోసం మహిళా మంత్రులు, కాంగ్రెస్ నేతలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీలో కౌశిక్ రెడ్డితో సీతక్కకు సారీ చెప్పించామని గుర్తు చేశారు. కానీ,
అదే అసెంబ్లలో తమను అవమానించిన సీఎం కనీసం క్షమాపణ చెప్పలేదని విమర్శించారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సునీతా లక్ష్మారెడ్డి విమర్శించారు. హరీష్ సవాల్‌తోనే రైతులకు రుణమాఫీ చేశారన్నారు. పూర్తి రుణమాఫీ చేయకుండానే చేశామని చెబుతున్నారని దుయ్యబట్టారు. మహిళా కమిషన్ సుమోటోగా తీసుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయన్నారు. మహిళా భద్రత, షీ టీమ్స్ ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. ముందుగా మహిళల రక్షణపై శ్రద్ధ పెట్టండని ప్రభుత్వాని హితవు చెప్పారు సునితీ లక్ష్మారెడ్డి.కాంగ్రెస్ నేతలు డైవర్ట్ రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్సీ వాణి దేవి విమర్శించారు. మహిళ విషయంలో కేటీఆర్ పొరపాటుగా కామెంట్స్ చేశారని.. ఆ వెంటనే క్షమాపణలు కూడా చెప్పారని గుర్తు చేశారు. ఏ మన్గి÷నా తప్పులు చేస్తారని.. దొర్లిన తప్పులకు హుందాగా కేటీఆర్ క్షమాపణలు చెప్పారన్నారు. చిన్న విషయాలను పెద్దగా చేయొద్దని కాంగ్రెస్ నేతలకు వాణి దేవి హితవు చెప్పారు. హరీష్ రావు ఇంటిమీద దాడి చేయడం ఏంటి? అని కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డారు. చిల్లర రాజకీయాలు మాని.. విద్యారంగ సమస్యలు పట్టించుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.


**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733